సాక్షి కాకినాడ

శనివారం । 14 । జూన్ । 2025



రూ.లక్ష విరాళం


సామర్లకోట: పంచారామ క్షేత్రంలో నిత్యాన్న దాన పథకానికి వస్తుల సత్య సూర్యనారాయణ, రత్నలీల దంపతులు (సామర్లకోట) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



అయినవిల్లిలో..

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పసుపులేటి సుజాత (సికింద్రాబాద్) శుక్రవారం రూ.101,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,800, మధ్య డెల్టాకు 250, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 15,761 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.95 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు

సామర్లకోట: మాస్టర్ ట్రైనర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జి.రమణ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఎంపీడీఓలు, ఈఓ పీఆర్డీ, సీనియర్ సర్పంచ్‌లకు మాస్టర్ ట్రైనర్లుగా ఈ నెల 10 నుంచి ఇచ్చిన శిక్షణ శుక్రవారం ముగిసింది. శిక్షణ పొందిన అధికారులు ఆయా జిల్లాల్లోని మహిళా సర్పంచ్‌లకు ఉత్తమ శిక్షణ అందించాలని ఈ సందర్భంగా రమణ సూచించారు. ఈ శిక్షణలు ఈ నెల 26న ప్రారంభించాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు కె.సునీల (కోర్స్ డైరెక్టర్) కేఆర్ నిహారిక, ఎం.చక్రపాణిరావు, టి.రామకృష్ణ, వి.జగన్నాథం, ఎ.రవిశంకర్, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



చండీ హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు చండీ హోమం ప్రారంభించారు. పూర్ణాహుతి అనంతరం అమ్మవారికి వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. తరువాత వాటిని భక్తులకు పంపిణీ చేశారు. చండీహోమంలో 30 మంది భక్తులు రూ.750 టికెట్టుతో పాల్గొన్నారు. వేద పండితులు వేదుల సూర్యనారాయణ, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు, వ్రత పురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యాన, తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం హరగోపాల్ ఆధ్వర్యాన పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాదులు సమర్పించి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు.

పల్లెలపై పగబట్టినట్లు..



నిధులు రాక..: సామర్లకోట మండలం జి. మేడపాడు బీసీ పేటలో ప్రారంభం కాని డ్రైన్ పనులు

- నిధులు విదల్చని కూటమి సర్కారు
- ముందుకు కదలని పనులు
- డిప్యూటీ సీఎంగా జిల్లా నుంచే పవన్..
- అయినా పైసల కోసం పెదవి విప్పని దుస్థితి
- ఆర్థిక సంఘం నిధులకూ బ్రేకులు
- గ్రామ పంచాయతీల్లో సింహభాగం వైఎస్సార్ సీపీవే
- అందుకే ప్రభుత్వం కక్ష కట్టినట్టుందని విమర్శలు



ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక సామర్లకోట మండలం జి.మేడపాడు ఎస్సీ పేటలో అభివృద్ధికి నోచని రోడ్డు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పల్లెలపై కూటమి సర్కారు పగబట్టినట్టుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యధిక పల్లెల్లో పాలనాధికారం వైఎస్సార్ సీపీ చేతుల్లో ఉంది. దీంతో, నిధులు విడుదల చేసి, పనులు జరిగితే ఆ క్రెడిట్ వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లకే దక్కుతుందనే దురాలోచనతో గ్రామ పంచాయతీల ప్రగతికి అడుగడుగునా మోకాలడ్డుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులకు ప్రభుత్వం మోకాలడ్డుతోంది. దీంతో, పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన గగనమవుతోందని సర్పంచులు ఆవేదన చెందుతున్నారు.

మార్చిలోనే వచ్చినా..

జిల్లాలో మేజర్, మైనర్ గ్రామ పంచాయతీలన్నీ కలిపి 385 ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం గత మార్చి నెలలోనే 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ఖజానాకు జమ చేసింది. ఈ విధంగా జిల్లాలోని గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.28.39 కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా కూటమి సర్కారు చిల్లిగవ్వ కూడా విదల్చకుండా కావాలనే ఈ నిధులను తొక్కి పెడుతోందని సర్పంచ్‌లు మండిపడుతున్నారు. ఆర్థిక సంఘం నిధులను టైడ్, అన్ టైడ్ విభాగాలుగా కేటాయిస్తారు. టైడ్ విభాగంలో పారిశుధ్యం, తాగునీటి అవసరాలకు,. అన్ టైడ్ విభాగంలో రోడ్లు, డ్రెయిన్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, విద్యుత్, మోటారు మరమ్మతులు, చెత్త సేకరించే కార్మికుల వేతనాల వంటి వాటికి ఖర్చు చేస్తారు. మేజర్ పంచాయతీలకు ఇంటి పన్నులు, చేపల చెరువుల వేలం, వారపు సంతలు, కాలువ గట్లు, ఏటిగట్లపై కొబ్బరి చెట్ల ఫలసాయం ద్వారా వచ్చే ఆదాయం వంటివి ఉంటాయి. వీటితో కొన్ని పనులు చేసే అవకాశం వాటికి ఉంటుంది. వీటితో పోలిస్తే మైనర్ గ్రామ పంచాయతీలకు సాధారణ నిధులు చాలా తక్కువగా ఉంటాయి. ఈ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపరచి, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆర్థిక సంఘం నిధులే దిక్కు. ప్రభుత్వం ఈ నిధులు ఇవ్వకపోవడంతో మైనర్ పంచాయతీలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నాయి.

నిలిచిన పనులు

గ్రామ స్వరాజ్యమే కూటమి లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరచుగా చెబుతూంటారు. కానీ, ఆర్థిక సంఘం నిధుల విడుదలకు వచ్చేసరికి మాత్రం రాజకీయం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను గత ఎన్నికల్లో జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గ ప్రజలు గెలిపించారు. ఆవిధంగా ఆయన ఈ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పైగా పంచాయతీరాజ్ శాఖ ఆయన చేతుల్లోనే ఉంది. అయినప్పటికీ ఆయన గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయించాల్సిన అవసరాన్ని గుర్తించకపోతే ఎలాగని పలువురు ఆక్షేపిస్తున్నారు. గ్రామాల ప్రగతి కోసం కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లిస్తున్నా పవన్‌కు పట్టకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. నిధులు రాకపోవడంతో జిల్లాలోని మేజర్, మైనర్ గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేని దుస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా పారిశుధ్యం, డ్రైన్లు, సిమెంటు రోడ్ల వంటి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వర్షాకాలం రాకుండా పనులు పూర్తి చేద్దామన్నా కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా ప్రజలను ఇబ్బందులు పెడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులు వస్తాయనే ఉద్దేశంతో స్థానిక సంస్థల ప్రతినిధులు అప్పులు చేసి మరీ కొన్ని అభివృద్ధి పనులు చేయించారు. వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పనులు ముందుకు సాగక పల్లెల్లో పాలన పడకేసి ప్రజలు కూడా నరకం కళ్ల చూస్తున్నారు.

ఇస్తారా.. ఇవ్వరా!

ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక పల్లె పాలనకు ఎదురవుతున్న ఇబ్బందులను 'సాక్షి' క్షేత్ర స్థాయిలో సామర్లకోట మండలంలో పరిశీలించింది. ఈ మండలంలో పెద్దబ్రహ్మదేవం, మేడపాడు, వేట్లపాలెం, ఉండూరు, మాధవపట్నం మేజర్ పంచాయతీలున్నాయి. ఒక్కో పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నుంచి రెండో విడతగా రూ.18 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ రావాల్సి ఉంది. అలాగే, ఈ మండలంలో 13 మైనర్ గ్రామ పంచాయతీలున్నాయి. వీటికి ఒక్కో దానికి రూ.3 లక్షల నుంచి రూ.8 లక్షల వరకూ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులివ్వకపోవడంతో ఎక్కడి అభివృద్ధి పనులు అక్కడే నిలిచిపోయాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నిధులు విడుదల కాకపోవడంతో ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని సర్పంచ్‌లు మథనపడుతున్నారు. కేంద్రం నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వ దయ కోసం నెలల తరబడి ఎదురుతెన్నులు తప్పడం లేదని సర్పంచ్‌లు, వార్డు సభ్యులు వాపోతున్నారు. ఈ నిధులిస్తే గ్రామాల్లోని దళితవాడల్లో రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి, తాగునీటి సదుపాయాల కల్పనకు, చెల్లింపులకు అవకాశం దక్కేదని చెబుతున్నారు. అసలు ఈ నిధులిస్తారా ఇవ్వరా అని పలువురు సర్పంచ్‌లు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ఎదురు చూస్తున్నాం



పెద్దబ్రహ్మదేవం గ్రామంలో తాగునీటి సమస్య దారుణంగా ఉంది. వేసవిలో 15వ ఆర్థిక సంఘం నిధుల బకాయిలు రూ.18 లక్షల వరకూ ఉన్నాయి. ఆ నిధులు విడుదలైతే మంచినీటి సమస్య పరిష్కారానికి ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నాం. ఆ నిధులు ఎప్పుడొస్తాయో, అసలు వస్తాయో రావో అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నాం. ఎస్సీ పేటలో రోడ్లు, డ్రైన్ సమస్యల శాశ్వత పరిష్కారానికి గంపెడాశతో ఎదురు చూస్తున్నాం.

– నీలపాల సత్యనారాయణ (బూరయ్య), సర్పంచ్, పెద్దబ్రహ్మదేవం, సామర్లకోట మండలం

పారిశుధ్య పనులు భారం



ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో మా గ్రామంలో పారిశుధ్య పనులు చాలా అధ్వానంగా మారాయి. కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోతున్నాం. పంచాయతీల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అత్యవసర పనుల నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. గ్రామాల్లో పనులు చేయించకపోతే ప్రజల నుంచి ఛీత్కారాలు ఎదురవుతున్నాయి. వర్షాకాలం మొదలైంది, పారిశుధ్య పనులు చేయకపోతే దోమలు వ్యాప్తి చెంది, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది. శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే పైపులైన్ మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుంది. 15వ ఆర్థిక సంఘం నిధులు రాక అత్యవసర పనులు చేయించేందుకు అప్పులు చేసి, ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

– కమిడి మంగాదేవి, సర్పంచ్, వేములవాడ, కరప మండలం

పారిశుధ్య నిర్వహణకు రీ టెండర్లు

- దేవదాయ శాఖ నోటిఫికేషన్
- దాఖలుకు 26 వరకూ గడువు
- వచ్చే నెల మొదటి వారంలో ఖరారయ్యే చాన్స్

అన్నవరం: సత్యదేవుని సన్నిధి సహా రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాల్లో పారిశుధ్య నిర్వహణకు దేవదాయ శాఖ సెంట్రలైజ్డ్ ఈ–ప్రొక్యూర్ రీ టెండర్ నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసింది. శానిటరీ మెటీరియల్ సహా పారిశుధ్య పనులు, వివిధ సత్రాల్లో హౌస్ కీపింగ్, రోడ్లు, టాయిలెట్స్ క్లీనింగ్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, ఏసీలు, ఇతర విద్యుత్ ఉపకరణాల నిర్వహణ తదితర పనుల నిర్వహణకు ఈ టెండర్ పిలిచారు. గత ఏప్రిల్‌లో పిలిచిన టెండర్ నోటిఫికేషన్‌పై టెండర్‌దారులు అనేక సందేహాలు వ్యక్తం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం దానిని రద్దు చేసింది. కొన్ని మార్పులతో తాజాగా కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. కొటేషన్ల దాఖలుకు జూన్ 26 చివరి తేదీగా నిర్ణయించారు. అన్నీ సవ్యంగా జరిగితే వచ్చే నెల మొదటి వారంలో టెండర్లు ఖరారు చేస్తారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, ద్వారకా తిరుమల, విజయవాడ దుర్గ గుడి, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవస్థానాల్లో రెండేళ్ల కాలపరిమితితో ఆగస్టు 1 నుంచి పారిశుధ్య పనులు ప్రారంభిస్తుంది.

నెలల తరబడి జాప్యం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏ దేవస్థానానికి ఆ దేవస్థానంలో శానిటేషన్ టెండర్లు పిలిచి ఖరారు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రముఖ దేవస్థానాలకు ఒకే టెండర్ పిలవాలని గత ఏడాది ఆగస్టు 27న నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ, దీని అమలులో దాదాపు పది నెలలు ఆలస్యం చేశారు. గత ఏడాది నవంబర్ వరకూ అన్నవరం దేవస్థానంలో హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ శానిటేషన్ విధులు నిర్వహించేది. ఆ సంస్థ కాంట్రాక్ట్ గత నవంబరుతో ముగిసింది. ఆ గడువుకు నెల రోజులు ముందే గత అక్టోబర్‌లో టెండర్ ప్రకటన విడుదల కావాల్సి ఉంది. అయితే, టెండర్లు పిలవడం ఆలస్యమవడంతో దేవస్థానం కోరిక మేరకు గత ఫిబ్రవరి నెలాఖరు వరకూ ఆ సంస్థ సిబ్బంది విధులు నిర్వహించారు. మార్చి 1 నుంచి ఎటువంటి టెండరూ పిలవకుండా గుంటూరుకు చెందిన కనకదుర్గా శానిటరీ సర్వీసెస్‌కు తాత్కాలికంగా అప్పగించారు. శానిటరీ మెటీరియల్ మాత్రం దేవస్థానమే అందిస్తోంది.

రూ.80 లక్షలకు పెరిగే అవకాశం

దేవస్థానంలో గతంలో పారిశుధ్య పనులు నిర్వహించిన కేఎల్‌టీఎస్ సంస్థకు నెలకు రూ.49 లక్షలకు టెండర్ ఖరారైంది. అనంతరం తాత్కాలికంగా వచ్చిన కనకదుర్గా ఏజెన్సీకి నెలకు రూ.59 లక్షలు జీతాలు, మరో రూ.12 లక్షలు మెటీరియల్‌కు కలిపి మొత్తం రూ.71 లక్షలు చెల్లిస్తున్నారు. తాజాగా అన్ని దేవస్థానాలకు కలిపి పిలిచిన సెంట్రలైజ్డ్ టెండర్‌లో పారిశుధ్య పనుల్లో అత్యాధునిక యంత్రాలు ఉపయోగించాలనే షరతు విధించారు. అలాగే, శానిటరీ సిబ్బందికి లేబర్ యాక్ట్ ప్రకారం జీతాలు చెల్లించాలని, వారాంతపు సెలవుల్లో సిబ్బంది రిలీవర్లుగా మరి కొంత మందిని నియమించాలని షరతు పెట్టారు. అలాగే, ఏసీలు, విద్యుత్ ఉపకరణాల నిర్వహణ కూడా కలిపారు. ఇవన్నీ కలిపితే అన్నవరం దేవస్థానంలో నెలకు రూ.80 లక్షల వరకూ ఆయా సంస్థలు కోట్ చేసే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు.



అన్నవరం దేవస్థానం

ఆలయ భూముల రక్షణ బాధ్యత ఈఓలదే..



జిల్లా దేవదాయ అధికారి నాగేశ్వరరావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆలయాలు, సత్రాలకు చెందిన భూముల రక్షణ బాధ్యత ఈఓలదేనని జిల్లా దేవదాయ శాఖ అధికారి కనపర్తి నాగేశ్వరరావు అన్నారు. దేవదాయ శాఖ మండల ఎండోమెంట్ అధికారులు, ఈఓలతో శుక్రవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆలయాలు, సత్రాలకు ఉన్న భూములన్నీ రెవెన్యూ శాఖ 1బిలో నమోదయ్యాయో లేదో చూసుకోవాలన్నారు. ఆ భూమి వేరే వ్యక్తుల పేరిట ఉంటే తక్షణమే సంబంధిత ఆర్డీఓలకు వినతిపత్రం ఇచ్చి, 1బిలో దేవదాయ శాఖ భూమిగా నమోదు చేయించాలని ఆదేశించారు. ఈనాం భూములు కూడా వేరే వ్యక్తుల పేరిట ఉంటే వాటిని కూడా రెవెన్యూ శాఖ 1బిలో నమోదు చేయించాలన్నారు. 6సి దేవాలయాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. టెలి కాన్ఫరెన్స్‌లో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ కూడా పాల్గొన్నారు.

వేటకు వేళాయె..



గంగమ్మా.. కరుణించమ్మా..: బోట్లలో వేటకు బయలుదేరుతున్న మత్స్యకారులు (ఫైల్)



ఉప్పాడ రేవులో వేటకు సిద్ధంగా ఉన్న బోట్లు

- నిషేధంతో సముద్రంలో 61 రోజుల పాటు నిలిచిన చేపల వేట
- నేటి అర్ధరాత్రి పునఃప్రారంభం
- సందడిగా మారుతున్న తీర ప్రాంతాలు
- గంగమ్మకు పూజలు చేసి కడలిలోకి వెళ్లనున్న మత్స్యకారులు

జిల్లాలో తీరం పొడవు :	94 కిలోమీటర్లు
మత్స్యకారుల నివాస ప్రాంతాలు :	58
మత్స్యకారులు :	1,95,184
వీరిలో చేపల వేట చేసేవారు :	36,101
అనుబంధ రంగాలపై ఆధారపడిన వారు :	సుమారు 75,000
ఫిష్ ల్యాండింగ్ సదుపాయాలున్న ప్రాంతాలు :	23
కమ్యూనికేషన్ స్టేషన్ :	కాకినాడ
మెకనైజ్డ్ బోట్లు :	410
మోటారైజ్డ్ బోట్లు :	3,732
సంప్రదాయ పడవలు :	287
ప్రధాన రేవులు : కాకినాడ కుంభాభిషేకం, కాకినాడ ఫిషింగ్ హార్బర్, ఉప్పాడ	

వేట నిషేధ పరిహారం ఇచ్చారిలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

- మత్స్యకార కుటుంబానికి రూ.4 వేల చొప్పున 2019 వరకూ 22,250 మందికి రూ.8.90 కోట్లు మాత్రమే ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

- అప్పటి వరకూ రూ.4 వేలు మాత్రమే ఉన్న భృతిని రూ.10 వేలకు పెంచారు.

సంవత్సరం	లబ్ధిదారులు	పరిహారం (రూ.కోట్లు)
2019–20	23,190	23.19
2020–21	24,587	24.58
2021–22	30,213	30.21
2022–23	21,394	21.39
2023–24	24,147	24.14

- వేట నిషేధం కారణంగా ప్రభావితులైన బోటు యజమానులు, కళాసీలు 1,23,531 మందికి 2019–20 నుంచి 2023–24 వరకూ రూ.123.51 కోట్ల మేర మత్స్యకార భరోసా సొమ్ము అందించారు.

కాకినాడ రూరల్/పిఠాపురం: వలలు సరి చేసుకుని, బోట్లు సరి చూసుకుని.. కడలి అలలపై బతుకు పాట సయ్యాటకు గంగపుత్రులు సిద్ధమవుతున్నారు. బంగాళాఖాతంలో మత్స్య సంతతి వృద్ధి చెందేందుకు వీలుగా ఏప్రిల్ 15 నుంచి చేపల వేటపై నిషేధం అమలు చేశారు. దాదాపు రెండు నెలల పాటు కొనసాగిన ఈ నిషేధం శనివారం అర్ధరాత్రితో ముగియనుంది. దీంతో, శనివారం అర్ధరాత్రి, ఆదివారం నుంచి సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు ఉద్యుక్తులవుతున్నారు. ఇప్పటికే ఫైబర్ బోట్లలో మత్స్యకారులు బయలుదేరగా.. సముద్రంలో సుదూర ప్రాంత జలాల్లో చేపలు వేటాడే సోనా బోట్ల నిర్వాహకులు కాకినాడ ఏటిమొగ వద్ద ఆదివారం గంగమ్మ తల్లికి పూజలు చేసి, సాయంత్రం బయలుదేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వేట పునఃప్రారంభం కావడంతో తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో సందడి నెలకొంది. మాంసాహార ప్రియులు లొట్టలేసుకుని తినే సముద్ర చేపలు, రొయ్యలు, పీతల రుచులు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

> **రూ.10 వేల వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచామని కూటమి పెద్దలు గొప్పలు చెప్పుకొంటున్నారు. కానీ, గత ఏడాది ఎగ్గొట్టి, ఈ ఏడాది మాత్రమే ఇవ్వడం వలన కూటమి ప్రభుత్వం** కూడా ఏడాదికి రూ.10 వేల చొప్పున మాత్రమే ఇచ్చినట్లయ్యింది. రెండేళ్లకు కలిపి రూ.100 కోట్లు పైగా ఇవ్వాల్సి ఉండగా రూ.49 కోట్లు విడుదల చేశారు. అది కూడా ఇప్పటి వరకూ రూ.25 కోట్లు మాత్రమే జమ అయినట్లు మత్స్యకార నాయకులు చెబుతున్నారు.

భృతి.. అందరికీ అందలే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ.20 వేల చొప్పున ఇస్తామని నమ్మించారు. గత ఏడాది 24,947 మందికి రూ.20 వేల చొప్పున సుమారు రూ.49 కోట్లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఏ ఒక్కరికీ ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఈ ఏడాది జిల్లాలోని 4,451 బోట్లకు సంబంధించి 25,752 మంది మత్స్యకారులను గుర్తించారు. వీరికి రూ.51.50 కోట్లకు పైగా భృతి అందించాల్సి ఉంది. అయితే, వివిధ సాకులతో వీరిలో 24,762 మందిని మాత్రమే అర్హులుగా నిర్ధారించారు. మిగిలిన 990 మందిని అనర్హులుగా తేల్చి రూ.19 కోట్లు ఎగ్గొట్టారు. అర్హులుగా గుర్తించిన వారిలో కూడా ఇంకా 1,445 మందికి వివిధ కారణాలతో ఇప్పటి వరకూ వేట నిషేధ భృతి చెల్లించలేదు. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ అవ్వకపోవడంతో నిధులు జమ కాలేదని, వీటిలో 1,200 మందివి సరి చేసి తిరిగి ప్రభుత్వానికి పంపామని, మిగిలిన 245 మంది గ్రామాల్లో లేరని జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు చెప్పారు. ఇదిలా ఉండగా, కొంత మందికి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని కూడా సాకుగా చూపిస్తున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. కాగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హులైన మత్స్యకారులందరికీ నాలుగేళ్ల పాటు నిర్విరామంగా మత్స్యకార భరోసా సకాలంలో అందించారు.

గత ఏడాది వేయలేదు.. ఈ ఏడాది ఇవ్వడం లేదు



వేట లేకపోతే మా కుటుంబానికి పూట గడవదు. ఈ రెండు నెలలూ మాకు నరకంలా ఉంది. అయినప్పటికీ ఏదో కష్టపడి కుటుంబాన్ని పోషించుకున్నాం. మాకు అండగా ఉండే మత్స్యకార భృతి గత ఏడాది వేయలేదు. అదిగో ఇదిగో అని సరిపెట్టేశారు. ఈసారి వేస్తారని చూశాను. కానీ, ఇప్పుడు కూడా వేయలేదు. అడిగితే ఏవో కారణాలు చెబుతున్నారు. ఎప్పుడు అడిగినా వేసేస్తామంటున్నారు తప్ప వేయడం లేదు. ఎవరిని అడగాలో, ఎక్కడికెళ్లాలో తెలియడం లేదు. తెలుసున్న వారిని అడగడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. మాలాంటోళ్లని ఏడిపించడం ప్రభుత్వానికి మంచిది కాదు. దయచేసి మా డబ్బులు మాకు వేసి ఆదుకోండి.

– బెణుగు స్వామి, మత్స్యకారుడు, కోనపాపపేట, కొత్తపల్లి మండలం

అదిగో ఇదిగో అంటున్నారు



చాలా సంవత్సరాలుగా మా కుటుంబానికి చేపల వేటే ఆధారం. ఏటా చేపల వేట నిషేధం విధించే రెండు నెలలూ మాకు గడ్డు కాలం. ఆ రోజుల్లో ఏ ఆదాయమూ లేక అప్పులు చేసి కుటుంబాన్ని గడుపుకోవాల్సి వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల పాటు ప్రతి ఏటా కచ్చితంగా మత్స్యకార భరోసా వేశారు. అప్పుడు ఇబ్బంది లేకుండా పోయింది. కానీ గత ఏడాది నుంచి ప్రభుత్వం ఈ డబ్బులు వేయడం లేదు. ఇప్పుడు వేశామంటున్నారు కానీ మాకు రాలేదు. ఎందుకు రాలేదో తెలియడం లేదు. ఎవరినడిగినా చూస్తామంటున్నారు తప్ప డబ్బులు పడటం లేదు. ఇప్పటికైనా ఆ డబ్బులిచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

– సక్కా తాతారావు, మత్స్యకారుడు, కోనపాపపేట, కొత్తపల్లి మండలం

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



మత్స్యకార భృతి ఎవరెవరికి, ఎందుకు రాలేదో పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటాం. అర్హత లేకపోతే ఏవిధంగా లేదనే విషయంపై విచారణ చేస్తాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మత్స్యకార భృతి వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖాధికారి, కాకినాడ

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,000
గటగట (వెయ్యి)	25,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఈటీసీ ప్రిన్సిపాల్‌గా ప్రసాద్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా కేఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శిక్షణ కేంద్రంలోని మెస్ వివాదంలో చిక్కుకోవడంతో బదిలీ అయ్యారు. దాంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జి.రమణ వ్యవహరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా పెద్దాపురంలో డీడీఈఏగా పనిచేస్తున్న ప్రసాద్‌ను విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించింది. దాంతో జిల్లాలోని కొందరు ఎంపీడీఓలతో కలిసి ఆయన విస్తరణ శిక్షణ కేంద్రంకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తరణ శిక్షణ కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. డ్వామా ఏపీడీ మోకా భానుప్రకాష్, డీఎల్‌డీఓ వాసుదేవరావు, డీడీఈఏ శ్యామల, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈటీసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణ, ఫ్యాకల్టీలు పాల్గొని ప్రసాద్‌కు స్వాగతం పలికారు.

రక్తం పంచి..ఆయువు పెంచి..

- ఆపదలో ఆదుకుంటున్న పలువురు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

రాయవరం: రక్తదానం మహోన్నతం. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకున్న వారు ప్రాణ బంధువులే. ఏ బంధం లేకున్నా మానవీయ కోణంలో స్పందించే తీరు ఐక్యతను చాటుతుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారికి, శస్త్ర చికిత్స అవసరమైన వారికి రక్తదానం చేసి ఆదుకున్న వారు ఆప్తులకు మించిన వారుగా చెప్పవచ్చు. రక్తం అవసరం ఉందనే విషయం వాట్సాప్, వివిధ రకాల సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని యువత స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

అన్ని దానాల్లోకెల్లా మిన్న

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని అంటారు. కాని నేడు అదే మాటను అన్ని దానాల్లోకల్లా రక్తదానం మిన్న అని చెప్పుకోవాల్సి వస్తుంది. అన్నదానం చేస్తే ఒక్క పూట కడుపు నిండుతుంది. కాని రక్తదానం చేస్తే..ఒక ప్రాణం నిలబడుతుంది. ఒకప్పుడు రక్తదానం చేస్తే నీరసించి పోతారని, పాడైపోతారనే అపోహలు ప్రజల్లో ఉండేవి. శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంతగా అభివృద్ధి చెందినా కృత్రిమ రక్తాన్ని తయారు చేయలేక పోయారు. రక్తాన్ని కేవలం దానం చేయడం ద్వారా మాత్రమే సేకరించగలుగుతున్నారు. రక్తం అందుబాటులో లేక పలువురు ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొంటున్నారు. రక్తం లభ్యమైన సందర్భాల్లో కొందరు ప్రాణాపాయం నుంచి బయట పడిన సందర్భాలు ఉన్నాయి. రక్తదాతలలకు అవగాహన మరింత కల్పించాల్సిన అవసరం ఉంది. రక్తదానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోరాదు. మన శరీరంలో ఐదు లీటర్ల రక్తం ఉంటుంది. రక్తదాన సమయంలో కేవలం 350మిల్లీలీటర్ల రక్తాన్ని మాత్రమే తీసుకుంటారు. అందువల్ల ఎటువంటి హాని కలగదు. రక్తదానం చేస్తే ఇన్ఫెక్షన్స్ వస్తాయన్నది కేవలం అపోహ మాత్రమే. రక్తదానానికి ఒక గంట సమయం మాత్రమే పడుతుంది. రక్తదానం చేస్తే హిమోగ్లోబిన్ శాతం పడిపోతుందనేది కూడా అపోహే అంటున్నారు వైద్యులు.

రక్తదానానికి అర్హతలు

- 18 నుంచి 60 ఏళ్ల లోపు స్త్రీ, పురుషులు ఎవరైనా రక్తాన్ని దానం చేయవచ్చు.
- మూడు నెలల వ్యవధితో రక్తదానం చేయవచ్చు.
- రక్తదానం చేయడానికి 12గంటల ముందు తర్వాత ఆల్కహాల్ తీసుకోరాదు.
- రక్తదానం చేసే వారు 45 కేజీల పైబడి బరువును కలిగి ఉండాలి.
- స్త్రీలు రుతుక్రమం సమయంలో, గర్భం ధరించినప్పటి నుంచి బిడ్డకు పాలివ్వడం ఆపేంత వరకు రక్తదానం చేయరాదు.
- రక్తంలో హిమోగ్లోబిన్ కనీసం 12.5 గ్రాములకు తక్కువ కాకుండా ఉండాలి.

రక్తంలో ఏం ఉంటాయి?

రక్తంలో 55శాతం ప్లాస్మా, 45శాతం సెల్స్ ఉంటాయి. ప్లాస్మాలో 91శాతం నీరు, 8శాతం ఆర్గానిక్ మాలిక్యూల్స్, ఒక శాతం ఇనర్గానిక్ మాలిక్యూల్స్ ఉంటాయి. సెల్స్‌లో తెల్ల రక్తకణాలు, ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ ఉంటాయి. ఒక మైక్రో లీటరు రక్తంలో 5.6 మిలియన్ల ఎర్ర రక్తకణాలు ఉంటాయి. ఒక మైక్రో లీటరు రక్తంలో 11వేల వరకు తెల్ల రక్తకణాలు ఉంటాయి. ఇవి ఆక్సిజన్ సరఫరాకు తోడ్పడతాయి. తెల్ల రక్తకణాలు శరీరంలో ఉండి రోగకారక క్రిములపై దాడి చేసి రక్షణ కల్పిస్తాయి. 1.5 నుంచి 4.5 లక్షల ప్లేట్‌లెట్స్ కణాలు రక్తం గడ్డకట్టడానికి సహకరిస్తాయి.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం, రాజోలులో బ్లడ్ బ్యాంకులున్నాయి. కొత్తపేట, పి.గన్నవరం, మండపేట, ఆలమూరు, కపిలేశ్వరపురం, ముమ్మిడివరం, అల్లవరం, టి.కొత్తపల్లి పీహెచ్‌సీల్లో బ్లడ్ స్టోరేజ్ సెంటర్లు ఉన్నాయి. ఏడాదికి వలంటీర్ బ్లడ్ డోనర్స్ నుంచి 18వేల యూనిట్ల రక్తాన్ని జిల్లావ్యాప్తంగా సేకరిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మే 31 వరకు 1,093 ప్రసవాలు జరగ్గా 706 సిజేరియన్స్ నిర్వహించారు. వందల సఖ్యంలో మేజర్, మైనర్ శస్త్ర చికిత్సలు చేశారు. ప్రసవాలు, ప్రమాదాలు, అత్యవసర శస్త్ర చికిత్సలు సమయంలో రక్తాన్ని వినియోగిస్తున్నారు. అరుదైన బ్లడ్ గ్రూప్‌ల డోనర్స్ వివరాలను జిల్లా రక్తనిధి కేంద్రం సిబ్బంది సేకరించి, ఆ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో వీరి ద్వారా రక్తాన్ని సేకరిస్తున్నారు. జిల్లాలో రక్త కొరత లేదని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ కె.కార్తీక్ తెలిపారు. కళాశాలల్లో విద్యార్థులు, పోలీసు సిబ్బంది, రాజకీయ సంస్థలకు చెందినవారికి రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు.



మండపేటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేస్తున్న దాత (ఫైల్)



అమలాపురంలో రక్తదాతలచే రక్తదానం చేయిస్తున్న ఆకుల శ్రీనివాస్

రోగుల సేవలో తరిస్తూ..

కొత్తపేట: అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ 15 ఏళ్ల ప్రాయం నుంచీ సైకిల్‌పై మొక్కలు వ్యాపారం చేసేవాడు. ఒకసారి కడియపులంక నుంచి మొక్కలు తెచ్చుకుంటుండగా రావులపాలెం వద్ద లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. రక్తస్రావమై ఇబ్బంది పడ్డాడు. కొంత కాలానికి కోలుకుని బతికి బయటపడ్డాడు. తరువాత నుంచి కొత్తపేటలో స్వామి వివేకానంద యోగాశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచీ తాను స్వయంగా 24 సార్లు రక్తదానం చేయగా, తన సంస్థల స్టూడెంట్స్, దాతల సహకారంతో రక్తదానం చేయిస్తున్నారు. రక్తం అవసరమైన రోగుల బంధువులు రక్తం కోసం సంప్రదించినప్పుడు సాధ్యం కాదు అనే మాట రాకుండా రక్తం ఇప్పిస్తున్నారు.

ఇతర జిల్లాలకు సైతం తీసుకువెళ్లి...

స్థానికులకే కాక స్థానికేతర ప్రాంతాలకు, ఇతర జిల్లాలకు సైతం రక్తదాతలను తీసుకువెళ్లి రక్తదానం చేయిస్తున్నారు. కోనసీమ జిల్లాలోని అమలాపురం బ్లడ్ బ్యాంకుల ద్వారా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు కూడా తీసుకువెళ్లి రక్తదానం చేయించి సేవా సంస్థలు, ప్రముఖుల మన్ననలు పొందుతున్నారు.

అరుదైన బ్లడ్ గ్రూపులు

కొందరు అరుదైన బ్లడ్ గ్రూపులు కలిగి ఉంటారు. అటువంటి వారికి రక్తం అవసరమైన సందర్భంలో అదే గ్రూపు రక్తం ఇవ్వాల్సి ఉంటుంది. ఏ, ఏబీ, బీ, ఓ నెగిటివ్ గ్రూపులు అరుదైన గ్రూపులు. ఇటువంటి గ్రూపులకు చెందిన వ్యక్తులు ప్రమాదాలకు గురైనప్పుడు అరుదైన బ్లడ్ గ్రూపుల వారి నుంచి సేకరించిన రక్తాన్నే అందజేయాల్సి ఉంటుంది.

అనర్హులు ఎవరంటే...

సాధారణంగా రక్తదానం శ్వాసకోశ వ్యాధులున్న వారు, క్యాన్సర్, గుండెజబ్బులు, బరువు తగ్గడం, డయాబెటిక్, హెపటైటిస్, ఆస్తమా, ఎపిలెప్సీ, కాలేయ వ్యాధులు, ఎండోక్రైన్ సమస్యలు, ఎయిడ్స్ లక్షణాలు కలిగిన వారు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు రక్తదానం చేయరాదు. మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు చికిత్స పొందిన వారు శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, రక్తదానం పొందిన వారు కనీసం ఏడాది వరకు రక్తదానం చేయడానికి వీలులేదు. దగ్గు, జలుబు, జ్వరం వంటి అస్వస్థత కలిగిన వారు, ఏదైనా చికిత్సలో భాగంగా మందులు వాడుతున్న వారు ఆ విషయాల్ని వైద్యులకు చెబితే వారు ఎప్పటి వరకు రక్తదానం చేయరాదన్న విషయాన్ని చెబుతారు.

23 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నా..



2002 నుంచి రక్తదానం చేస్తూ ఇతరులను ప్రోత్సహిస్తున్నాను. ప్రస్తుతం తూర్పుగోదావరి వలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ పేరుతో రక్తదానం చేస్తున్నాం. ఈ క్లబ్‌లో రోజువారీ కూలీలతో పాటు ఆటోడ్రైవర్లు, పలు వృత్తుల్లో కొనసాగుతున్న 1,500 మంది సభ్యులుగా ఉన్నారు. మా సంస్థ ద్వారా ఇప్పటి వరకు 38 బ్లడ్ క్యాంపుల ద్వారా రక్తాన్ని సేకరించి, రోటరీ, రెడ్‌క్రాస్ వంటి సంస్థలకు అందజేశాం.

– వెలగల ఫణికృష్ణారెడ్డి, తూర్పుగోదావరి జిల్లా వలంటరీ బ్లడ్అండ్ఐ బ్యాంక్ చైర్మన్, రాయవరం

ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి



ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని ప్రోత్సహించడం వలన ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడిన వారవుతారు. ప్రతి నెలా స్వచ్ఛంద సంస్థల నుంచి, దాతల నుంచి రక్తాన్ని సేకరించి భద్రపరుస్తాం. అత్యవసర సమయాల్లో అవసరమైన వారికి అందిస్తున్నాం.

– డాక్టర్ పి.అన్నపూర్ణ, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (పెథాలజీ), ఏరియా ఆస్పత్రి, అమలాపురం

జాతీయ రహదారిపై ఆటోను ఢీకొన్న లారీ

- 11 మందికి తీవ్ర గాయాలు
- రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

దేవరపల్లి: జాతీయ రహదారిపై గుండుగొలను–కొవ్వూరు మధ్య శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం రాజమహేంద్రవరంలోని సీతంపేటకు చెందిన 11 మంది ఆటోలో శుక్రవారం తెల్లవారు జామున విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం కోసం బయలుదేరారు. దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద ముందు వెళుతున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటోలోని 11 మంది తీవ్రంగా గాయపడగా, హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. క్షతగాత్రుల వివరాలు తెలియవలసి ఉంది. గాయపడిన వారిలో పలువురు మహిళలు ఉన్నారు.



క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న

బీఎస్ఎఫ్ ఆర్ఎస్సైకి సన్మానం

కాకినాడ రూరల్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న బీఎస్ఎఫ్ ఆర్ఎస్సై ఆర్.దేవానందంను కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు, సిబ్బందితో కలిసి సన్మానించారు. ఏపీఎస్పీలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న దేవానందం అల్లుడి ఇంటికి రావడంతో విషయం తెలుసుకున్న కమాండెంట్ నాగేంద్రరావు పిలిపించి సన్మించారు.

దేశానికి సేవ చసిన మహనీయుడిని సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. బీఎస్ఎఫ్ ఆర్ఎస్సై దేవానందం మాట్లాడుతూ బీఎస్ఎఫ్‌లో 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్నానని, ఆపరేషన్ సిందూర్‌లో తన వంతు పాత్ర పోషించినందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్స్ మోహన్‌రావు, చంద్రశేఖరరావు, రాము పాల్గొన్నారు.



బీఎస్ఎఫ్ ఆర్ఎస్సై దేవానందంను సత్కరిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

టీడీపీ ఎమ్మెల్యే అనుచరుడిపై పోక్సో కేసు

- బాలికను మోసగించి ముఖం చాటేసిన వైనం
- అబార్షన్ చేయించిన నిందితుడు
- కేసు నమోదు చేసిన బొమ్మూరు పోలీసులు



నిందితుడు సత్యదేవ్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ ఎమ్మెల్యే అనుచరుడిపై పోక్సో కేసు నమోదు అయింది. అతను బాలికను గర్భవతిని చేసి ముఖం చాటేశాడు. ఏడు నెలల గర్భవతిగా ఉన్న ఆమెకు అబార్షన్ చేయించిన అతనిపై బాధితురాలు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలతో కలిసి శుక్రవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెళ్లి చేసుకోమంటే కులం తక్కువ దానివంటూ దూషిస్తున్నాడని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. ఎమ్మెల్యే అనుచరుడు కావడంతో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా పోలీసులు తాత్సారం చేశారని బాధితురాలు ఆరోపించారు. రాజమహేంద్రవరం మోరంపూడి ప్రాంతానికి చెందిన పులపర్తి సత్యదేవ్ 2022 నుంచి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను మోసగించాడు. 2024 నవంబర్ నెలలో బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ బాలిక 6వ నెల గర్భవతి అని నిర్ధారించారు. ఈ మేరకు పులపర్తి సత్యదేవ్ వద్దకు వెళ్లి ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోమని కుటుంబ సభ్యులు అడిగారు. అయితే నేను ఇప్పుడు అయ్యప్పస్వామి మాలలో ఉన్నాను. మాల తీసే లోపు మీ అమ్మాయికి అబార్షన్ చేయించమని కోరాడు. దీంతో 2024 డిసెంబర్ 17న బాలికకు ధవళేశ్వరంలోని ఓ ఆసుపత్రిలో అబార్షన్ చేయించారు. అనంతరం పెళ్లి చేసుకోమని అడుగగా అప్పటి నుంచి సత్యదేవ్ ఆచూకీ తెలియలేదని, ఈ మేరకు న్యాయం చేయాలని బొమ్మూరు పోలీసులను ఆశ్రయించినట్లు బాధితురాలు తెలిపారు.

బాధితురాలికి న్యాయం చేయండి

గర్భవతిని చేసి అబార్షన్ చేయించిన నిందితుడు పులవర్తి సత్యదేవ్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించి బాధితురాలికి న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు మార్తి లక్ష్మి, పోలు విజయలక్ష్మి తదితరులు తూర్పుజోన్ డీఎస్పీ విద్య, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్‌ను కోరారు. బాధితురాలితో కలిసి పోలీసు అధికారులను కలిసి ఆమెకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. రాష్ట్ర తెలికులగాండ్ల కార్పొరేషన్ మాజీ చైర్మన్ సంకిన భవానిప్రియ, మహిళా నేతలు పాల్గొన్నారు.



బాధితురాలికి న్యాయం చేయాలని తూర్పు జోన్ డీఎస్పీ విద్య, ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథంను కోరుతున్న వైఎస్సార్ సీపీ మహిళానేతలు

మానవతా దృక్పథంతోనే కేసు నమోదు ఆలస్యం : డీఎస్పీ విద్య

మానవతా దృక్పథంతోనే బాధితురాలు కోరిక మేరకు కేసు నమోదు ఆలస్యమైందని తూర్పుజోన్ డీఎస్పీ బి.విద్య అన్నారు. శుక్రవారం బొమ్మూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 4వ తేదీన బాధితురాలు కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. జిల్లా వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ సౌజన్య బాధితురాలిని బొమ్మూరు పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారన్నారు. ఆ సమయంలో ఆమెకు తాను, సౌజన్య కౌన్సెలింగ్ ఇచ్చామని, సత్యదేవ్‌తో తనకు వివాహం జరిపించాలని కోరిందన్నారు. దీంతో సత్యదేవ్‌ను, అతని బాబాయిని పిలిచి మాట్లాడామన్నారు. ఇంట్లో ఒప్పించి పెళ్లి చేసుకుంటానని, పదిరోజులు సమయం కావాలని కోరారన్నారు. పదిరోజులు కుదరదు ఏడురోజులలో విషయం తెలపాలని ఇద్దరికీ చెప్పామన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సత్యదేవ్‌పై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. అబార్షన్ చేసిన ఆసుపత్రిపై చర్యలు ఉంటాయన్నారు. సత్యదేవ్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. బొమ్మూరు పీఎస్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథం, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ సౌజన్య పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతైన బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు పార్థు (ఫైల్)

కాకినాడ రూరల్: కాకినాడ – ఉప్పాడ బీచ్ రోడ్డులో రూరల్ మండల పరిధిలో నేమాం రాళ్ల బీచ్ వద్ద గురువారం సాయంత్రం స్నానం కోసం దిగి గల్లంతైన జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బాలుడు సముద్రాల పార్థు(17) మృతి చెందాడు. తిమ్మాపురం పోలీసుల వివరాలు ప్రకారం పార్థు, అతని స్నేహితులు నిడదవోలుకు చెందిన నారపురెడ్డి దుర్గాప్రసాద్, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం మండలానికి చెందిన కేతామోహన్ కలిసి బైక్‌పై గురువారం సాయంత్రం కాకినాడ బీచ్‌కు వచ్చారు. స్టోన్ బీచ్ వద్ద సాయంత్రం 4.30గంటల సమయంలో పార్థు, దుర్గా ప్రసాద్ స్నానం చేస్తుండగా మోహన్ ఫొటోలు తీశాడు. ఆ సమయంలో పార్థు బలమైన అలలకు కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు తిమ్మాపురం పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం ఉదయం 11గంటలకు ఘటన స్థలం సమీపంలోనే బాలుడి మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్య

కొత్తపేట: తండ్రి మందలించాడని మనస్తాపంతో ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్సై జీ సురేంద్ర శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని పలివెలశేరేపాలెం గ్రామానికి చెందిన తులా రాంబాబు కుమారుడైన సతీష్ (31) గురువారం పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. భోజనం చేస్తున్న సమయంలో పనికి వెళ్లగా వచ్చిన డబ్బు ఇంట్లో ఇవ్వకుండా రోజూ మద్యం తాగుతున్నావని తండ్రి రాంబాబు మందలించాడు. దాంతో మనస్తాపం చెందిన సతీష్ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కొంతసేపటి తరువాత గదిలోంచి శబ్దం రావడంతో తండ్రి రాంబాబు కిటికీలోంచి చూడగా మంచంపైన ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని వేళ్లాడుతున్నాడు. స్థానికుల సాయంతో తలుపుతీసి సతీష్‌ను కిందికి దించి చూడగా స్పృహ లో లేకపోవడంతో వెంటనే కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్టు ధ్రువీకరించారు. కాగా సతీష్‌కు వివాహం కాలేదు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.